
# నేనో మనిషిని!



-ఆర్. ఎస్. కె. మూర్తి

వచ్చి, అక్కడ తచ్చాడుతున్నా వదురు, బెదురు లేకుండా అలాగే కూర్చున్న ఆ చింపిరితలవాణ్ణి చూస్తే మల్లయ్యకు మరింత భయం కలిగింది. కొంప తీసి వీ డెవడన్నా మఫ్టీ పోలీసు కాదుగదా? మొన్న పట్నమెళ్లినప్పుడు పూజారి మల్లయ్య ఓ చిన్న చీకటి తప్పు చేశాడు. పోలీసు లొచ్చి, ఆ చిన్నదానితో సహా ఆయన్ని స్టేషనుకు పట్టుకెళ్లారు. అక్కడ హెడ్డు కేదో చెయ్యి తడిపి బయట పడేటప్పటికి బ్రహ్మ ప్రయత్న మైంది. అదేదన్నా తిరగతోడటానికి వచ్చిన మఫ్టీ వెధవ కాదు గదా, వీడు? దానితో శోభనపు పెళ్లికూతుర్ని ఆశీర్వ దించే ప్రయత్నాన్ని వదిలేసి, గబగబా రెండు బిందెలు నెత్తిని పోసుకొని, ఇంత చేసిన సూర్యభగవాన్లుకు ఈ గుక్కెడు నీళ్లన్నా పోయకుండా కూజాబిందె నెత్తుకు వెళ్లిపోయాడు, పూజారి మల్లయ్య.




• • •

పూజారి మల్లయ్య పోసిన నీళ్ళు తాగి, తేన్చుకుంటూ, కాస్త కరకరగా సాగివచ్చి, ఆ ఊరి చెట్లమీద సూర్య భగవాన్లు యుద్ధం ప్రారంభించే సమయానికి, పెళ్లాం పెట్టిన కరకర లాడే చీవాట్లు తిని, తేన్చుకుంటూ, ఇంత చుట్ట వెలిగించుకొని పెద్దమర్రి కొస్తాడు రోజూ, గన్నేరుచెట్టు గోవిందయ్య. గోవిందయ్య పెళ్లాం తుమ్మల తోపు భద్రయ్య పెళ్లాంతో పందెం కాసింది— నీ మొగుణ్ణి గద్దె దించి, నా మొగుడు ఊరి ప్రెసిడెంట్ కాకపోతే కాచుకో — అని. 'టు దట్ ఎండ్' ఆవిడ రోజూ పొద్దున్నే నిద్రలేచి, స్నానం చేసి, శుచియై భర్తకు నాలుగూ కరకరా వడ్డిస్తుంది. ఆ చీవాట్ల రుచు లను నెమరు వేసుకుంటూనే పెద్దమర్రి కొస్తాడు రోజూ, గోవిందయ్య. వచ్చి కొంత రాజకీయం నడుపుతుంటాడు, మర్రి కింద. పెళ్లాం పందెం గెలిచే వైపుగా కొంత ప్రోగ్రెస్ సాధిస్తుం టాడు, ప్రతి రోజూ. ఆ ప్రోగ్రెస్ రిపోర్టు ప్రెజెంటు చెయ్యకపోతే, ఆయన లంచికికూడా ఆ కరకరలే తినవలసి వస్తుంది.

రోజూ గోవిందయ్య పెద్ద మర్రికి చేరేసరికి 'సూక్తిముక్తావళి' పూర్తి అయి 'వ్యవసాయదారుల కార్యక్రమం' జరుగు తుంటుంది, రేడియోలో. హాలికుడైన గోవిందయ్య ముం దా విశేషాల్ని వింటాడు. తరవాత రాజకీయవేత్తగా వార్తల్ని శ్రద్ధగా ఆలకిస్తాడు. రేడియో 'క్రీడా రంగం' వార్తల్ని చెపుతుండగా అక్కడికి వస్తాడు, లడాయి పూలచెట్టు సుబ్బి శెట్టి.

శెట్టి ఇంటి ముందున్న చెట్టు పూల కీలాగ్రాలు పోటీ పుంజులకి మల్లే ఉంటాయి. పిల్లలు వాటితో లడాయి ఆట ఆడుకుంటారు. ఈ పిల్లాటలు చూడటం శెట్టికి ఎంతో సరదా. ఆయన వస్తూనే— "ఏంది, బాబూ, ఏంటి ఇశేషం? పాకిస్తానంవోడు మళ్లా లడాయికి వచ్చేనా?" అని అడుగుతాడు, ప్రముఖ రాజకీయవేత్త గోవిందయ్యను.

క్రిందటిసారి పాకిస్తాన్ యుద్ధం వచ్చినప్పుడు కదాచితుగా ఓ పది డబ్బాల కిరసనాయిలు నిలవ ఉండిపోయింది, శెట్టి దగ్గర. దానితో యుద్ధం వల్ల కలిగే ప్రయోజనాలేమిటో ఏ హిస్టరీ మాస్టరూ గొంతు చించుకోకుండానే శెట్టికి అర్థమై పోయినాయి. "ఈ సారి యుద్ధానికి పది రోజులు ముందే కబురు పెడతాలే. నాలుగు డబ్బాలు నిలవ చేసు కొని, పది డబ్బులు సంపాదించుకొందువు గాని" అని అభయమిచ్చాడు వాళ్ల ఎమ్. ఎల్. ఎ.—ఎన్నికల నిధికి శెట్టిగారి 'చందా' స్వీకరిస్తూ. అందుకే రోజూ శెట్టి గోవిందయ్యను ఆ ప్రశ్నే వేస్తుం టాడు. అయితే గోవిందయ్య శెట్టిగారి కిరసనాయిలు ఉత్సాహానికి పెట్రోలు పోయడు. శెట్టి కిరసనాయిల్లో కలిపే నీళ్లనే ఆయన ఉత్సాహంలోనూ కలుపు తుంటాడు గోవిందయ్య.

"ఇంకా పాకిస్తానోడు రావటమే? గుండా? చెరువా?" అంటూ లేని మీసాలు మెలేస్తుంటాడు గోవిందయ్య— మానెక్షాను పక్కన కూచోబెట్టి, పాకిస్తాన్‌వాణ్ణి తానే ఓడించానని జబ్బలు చరుచుకొనే రాజకీయ నాయకుల పోజులో.

"మరా ఎమ్. ఎల్. ఎ.బాబు అట్టా సెప్తాడేంటి?" అంటాడు శెట్టి, అప్పటికీ ఆశ చావక.

"ఎమ్. ఎల్.ఎ. బాబు చెప్పేది, మంత్రిబాబు చెప్పేది — వాడెక్కడ వస్తా డు? పాకిస్తానోడు యుద్ధానికి రావటం, మన పెసిడెంటు అవిశ్వాస తీర్మానం నెగ్గటం—రెండూ కొండ కొమ్ము పూలే" అంటాడు గోవిందయ్య. అలా జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల నుంచి పంచాయితీ రాజకీయాలలోకి వచ్చేయటం ఆయనకు వెన్నతో బెట్టిన విద్య. ఆ ఊరి ప్రెసిడెంట్ కావటానికి ఆయన కున్న ముఖ్యమైన అర్హతే అది.

"అయితే,బాబూ, అవిశ్వాస తీర్మానం మనం నెగ్గటం ఖాయమేనంటారా?" అంటాడు శెట్టి, అమాయకుడి పోజులో.

"ఏంది, శెట్టీ, నీ క్కూడా ఏవన్నా తల కెక్కుతున్నాదేటి? అళ్లు నెగ్గ అంటే. . ."

ఇక అక్కడినుంచి రిపోర్టుకి అవసర మైన ప్రోగ్రెస్ సాధించేవరకు చర్చ గ్రామాభివృద్ధిని గురించే జరుగుతుంది. అప్పుడు గోవిందయ్య ఇంటికెళ్లి, రిపోర్టు సమర్పించి, లంచ్ తిని, లైబ్రరీకి వెళతాడు. సాయంత్రమేమో గుడి అరుగు మీద మరికొంత ప్రజాసేవ చేస్తుం టాడు, ప్రెసిడెంట్ — డెజిగ్నేట్ గోవిందయ్య.

ప్రెసిడెంట్ భద్రయ్యకు గోవిందయ్య నీడం టేనే చిరాకు. అందుకని ఆయన రివెర్స్ డైరెక్షన్‌లో వస్తుం టాడు. పొద్దున్న గుడి అరుగు. సాయం త్రం పెద్ద మర్రి. మధ్యాహ్నం వీళ్లిద్దరు లైబ్రరీలో కలుసుకొనే ప్రమాదం ఉన్నది. కాని, మధ్యాహ్నంపూట భద్రయ్య పంచాయితీ ఆఫీసులో పాళీలు విరగ కొడుతుంటాడు కదా? అందువల్ల వారు కలుసుకోవటమనే చెకుముకిరాయి పని జరగదు, సర్వ సాధారణంగా.

మన కథాకాలంనాడు కరకరలు కాకుండా నాలుగు చక్కిలాలు పెట్టింది గ్రామానికి కాబోయే ఫస్ట్ లేడీ. రాత్రి గుడి అరుగుమీదనుంచి గోవిందయ్య పెద్ద వార్త పట్టుకొచ్చాడు. తాటితోపు పంచాయితీ మెంబర్ కూతురు పెళ్లికి లగ్నం పెట్టుకొని పది వేలు సర్దు మన్నాట్ట, ప్రెసిడెంట్‌ను. లేవన్నాట్ట భద్రయ్య. ఆ అప్పు శెట్టిచేత ఇప్పించి నట్లు ఇప్పించి, ఆ మెంబర్ని తన కొలపుకి తీసుకెళ్లగలనని హామీ ఇచ్చాడు గోవిందయ్య. అందుకే ఆవిడ చక్కిలాలు పెట్టింది, బ్రేక్ ఫాస్టుకి. అవి నములుతూ హడావుడిగా పెద్దమర్రి కొచ్చాడు గోవిందయ్య. తీరా వస్తే మర్రి తిన్నె మీద ఈ బవిరిగడ్డం వాడు!

"ఈ డెవరబ్బా, దొంగనాయాల! ఇక్కడ చేరాడు" అని విసుక్కున్నాడు గోవిందయ్య.

రోజూ గోవిందయ్యా, శెట్టీ కలిసి పెద్ద మర్రికింద నో పెద్ద ప్రజాసేవా ప్రహసనం నడుపుతుంటారు. ఏ పెళ్లాం పురుటికో అప్పు కావాలంటూ వస్తాడో గేస్తు. "నా సంగతి నీకు తెలీంది ఏముంది, రంగయ్య బాబాయ్? నీ కోడలు సంగతి తెలుసుగా? దమ్మిడీ మిగల్చదు. పోనీ, మన శెట్టి ఇస్తాడులే, తీసుకో. శెట్టీ, మా రంగయ్య బాబాయి కో వంద కావా లంట, సర్దు. ఊరికే వద్దులే, నీ వడ్డీ నువ్వు తీసుకునే ఇవ్వు" అంటాడు గోవిందయ్య.

"ఎంత మాట! తమరు సెప్తే వడ్డీ కూడానా" అంటాడు శెట్టి.

వద్యైద్యశాల (ప్రైవేట్) లిమిటెడ్, నంజన్‌గూడు
ఆయుర్వేద విద్వాన్ వి. వి. పండిట్ గారి నమ్మకమైన మందులు
ఇపుడు మీకు మిక్కిలి గుణము పెంపొందించబడినవి.
మీ పండ్లకు చాల ఉత్తమమైనది, నిరపాయకరమైనది.
నంజనగూడు పండ్లపొడి
అసలునే కొనండి I.D.L.61 ఔషధయుక్తమైనది. నకళ్లను వాడవద్దు
బిడ్డలకు కాస్మస్ కస్తూరి మాత్రలు
కర్జన్ గోరోజన మాత్రలు
బాలక్స్ విరేచన మాత్రలు
సోల్ ఏజంట్లు: యునైటెడ్ కన్సర్న్. 54. బందరువీధి. మద్రాసు.
సూపర్లు: విజయవాడ, హైదరాబాద్, పుండరీక్ అండ్ కం., మహబూబ్‌రోడ్డు, సికింద్రాబాద్

అలంకృత వధువు

ఆమె తన అందం, హృదయం, నగలతోబాటు క్రొత్త కాపురానికి వచ్చింది. ఆమె ఆనందదాయకమైన క్రొత్తజీవితాన్ని ప్రారంభించాలన్న కోరికతోవచ్చింది. కాని, తన తల్లి యిచ్చిన ఆ తాళంచెవి లేకుండా ఆమె నిశ్చింతగా ఆ ఆనందాన్ని పొందగలదా! ఆ స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ సేఫ్ డిపాజిట్ లాకర్ తాళంచెవితో తను,తను ఒక్కతె మాత్రమే తన సొమ్ములను తీయగలదు.



స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్

SBH-4



"ఓ యబ్బో, ఏం బకితి! వద్దులే. నువ్వు కొట్టుకునేదేదో ఎదాన కొట్టుకునే ఇవ్వు. మళ్లా నా మీద పడి ఏడుస్తావు!"

పది రూపాయలు వడ్డీ మినహాయించుకొని డబ్బు ఇస్తుంటాడు శెట్టి. ఇలా వడ్డీ వ్యాపారం సాగిస్తుంటారు శెట్టి, గోవిందయ్య. పెట్టుబడి, లాభాలుకూడా ఫిఫ్టీ— ఫిఫ్టీనే మరి!

ఈవేళ ఆ తాటితోపు మెంబర్‌కి పది వేలు ఇప్పించి, ప్రోగ్రెస్ సంపాదించాలనే ఆదుర్దాతోనే హడావుడిగా వచ్చాడు గోవిందయ్య. తీరా వస్తే ఈ బవిరి గడ్డంవాడు! ఎవరబ్బా వీడు! వీడి గడ్డం, వాలకం చూస్తే దోపిడీ వెధవల్లే ఉన్నాడే! తీరా మోసి ఏ దోపిడీ గాంగువాడో కాదుగదా? ఈమధ్య వడ్డీవ్యాపారస్థుల్ని తెగనరికి పారేస్తున్నారు, దోపిడీ వెధవలు. ఈ వెధవ ఉండంగా వడ్డీ వ్యాపారం చేయుట మెట్లా? ఛ ఛ! దొంగనాయాల! మంచి యవ్వారం చెడగొట్టాడే— అని విసుక్కుంటూ వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు గోవిందయ్య.

* * *

రోజూ గోవిందయ్య వెళ్లిన ఓ అర గంటకు పెద్దమర్రికి వస్తుంటాడు, జామితోపువారి అల్లుడు. పెద్దమర్రి హొటేల్లో టిఫిన్ చేసి, తిన్నెమీద కొలువు తీరుస్తాడు స్నేహితులతో. ఆ వేళకుగాని బావికి నీళ్లకు రారు, గొప్పింటి వాళ్లు. వాళ్లు చీరెల మీద స్నానాలు చేసి, బిందె లెత్తుకు పోతుంటే, ఓ తడి వెనక మున్న బిగువుకు నోరు తడారి పోతుంటే అట్లాగే చార్మినార్లు ఊదేస్తూ కూర్చుంటాడు అల్లుడు బాబు. ఆయన పెళ్లాం పక్క ఊరిలో స్కూలు మేస్త్రారు. ఈయనేమో ఉద్యోగం లేని ఇంజినీరు. శనివారం ఆదివారాల్లోగాని అమ్మాయి ఇంటికి రాదు. మిగతా అయిదు రోజులు అల్లుడు ఊరికే తయారీ తింటూ కూర్చోవటమేగా? ఆ రోజైనా అమ్మాయి కే తలకాయ నొప్పి వస్తే, ఎంచక్కా అమ్మ మంచంమీద పడి నిద్ర పోతుంది. క్రితం రాత్రి ఖచ్చితంగా అదే జరిగింది. అమ్మాయికి ప్రాణం బాగుండక పెందలాడే నిద్ర పోయింది. అల్లుడు బాబుకి ఒళ్లు పేలి పోతున్నది. అందుకే అతనా రోజున పెందలాడే పెద్ద మర్రికి పరుగెత్తు కొచ్చాడు, తడిచీరెల మీద నుంచి వచ్చే చల్లటి గాలులతో సేద తీరుదామని. తీరా వస్తే ఈ గుంటకళ్ల వెధవ!

అబ్బ, ఎంత ఎర్రగా ఉన్నాయి వెధవగాడి కళ్లు! వాలకం చూస్తే ఎవడో రౌడీవెధవల్లే ఉన్నాడే? — అల్లుడుగారు గతుక్కుమన్నారు.

అతనీ ఊరికి అల్లుడు కాకముందు, పట్నంలో హాస్టల్లో ఉండేవాడు. ఆ హాస్టలుకి కారియర్లు తీసుకొచ్చేదో పిల్ల. ఆ పిల్ల చేతివేళ్ల గుర్తులు ఎఫ్. బి. ఐ. వారికి కావాలంటే, ఆ హాస్టలు విద్యార్థుల చెంపలమీద దొరుకుతాయి. డస్టు చేసి, ప్రింట్లు తీసుకోవచ్చు. ఇది గమనించిన అల్లుడుగారు అటునుంచి నరుక్కొచ్చాడు. గుళ్లో రంగికి తాళి కట్టి, దాని ఓణీ, లంగాలను తస్కరించాడు, అల్లరి కృష్ణుడికి మల్లే. అది ఉత్త అల్లరే. కాని, ఆ రంగి కో అన్న ఉన్నాడు. రౌడీవెధవ! కళ్లు ఎప్పుడూ చింతనిప్పులల్లే ఉంటాయి. వాడికి తన అడ్రెను తెలియకుండా కాపాడుకొచ్చేసరికి తల ప్రాణం తోకకు వస్తున్నది, అల్లుడుగారికి. ఈ గుంటకళ్ల వెధవ అచ్చు ఆ రౌడీ వెధవల్లనే ఉన్నాడు. కంట పడితే కొంప తీసేస్తాడేమో? పెద్ద మంత్రి హోటేలు నుంచే వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు అల్లుడుగారు.

• • •

"ఏమండీ, అల్లుడుగారూ, ఏమిటి ఈవేళ ఇలా వచ్చారు?" అని పలకరించాడు పూజారి మల్లయ్య.

"ఏం చేస్తాం, మీ ఊరు మరీ ధర్మసత్రమై పోయింది" అని విసుక్కున్నాడు అల్లుడుగారు.

కాకపోతే నువ్వెందుకు ఉంటావులే ఇక్కడ — అని మనసులోనే అనుకున్న మల్లయ్య— "అదేమిటి, బాబూ, ఇప్పుడేమైంది?" అనడిగాడు, ఏమీ ఎరగనివాడికి మల్లే.

"ఏమైందా? పెద్ద మంత్రి కెళ్లి చూడు. ఎవడో రౌడీవెధవ బైఠాయించి కూర్చున్నాడు,చెట్టు కానుకొని. వాడెవరో, ఏమిటో ఊరికేం పట్టినట్లు లేదు."

"ఎవరు, బాబూ, వాడు?" ఆత్రంగా అడిగాడు మల్లయ్య.

"ఎవడో సి. ఐ. డి. వెధవై ఉంటాడు. ఊళ్లో ఎవరిమీదనో నిఘా వేయటానికి వచ్చి ఉంటాడు" అంటూ గుడి వెనక్కి గాంగుతో వెళ్లిపోయాడు, అటునుంచి నరుక్కు రావటం అలవాటైన అల్లుడుగారు.

• • •

గుడి అరుగుమీద గ్రామ నాయకత్వం నిర్వహిస్తున్న భద్రయ్య గుండె ఒక్కసారి ఎగిరిపడ్డది. సి. ఐ. డి. వెధవా? ఎందుకొచ్చి ఉంటాడబ్బా? కొంపతీసి తన కాంట్రాక్టులు, తుఫాను లోన్లు గొడవ పైదాకా వెళ్లలేదు కదా? ఈ గోవిందయ్య గాడేమీ నిప్పు ముట్టించలేదు కదా? అంతే. ఆ వెధవే ఎవణ్నో తీసుకొచ్చి ఉంటాడు. చేరటమే పెద్ద మంత్రి దగ్గరకు చేరాడంటే ఇది గోవిందయ్యగాడి పనే! ఇంతకీ వాడెవడో? వెళ్లి చూద్దామంటే ఇప్పుడక్కడ గోవిందయ్య కొలువు తీర్చి ఉంటాడు కదా?

మనిషిని లగెత్తించాడు ప్రెసిడెంట్ బాబు. గోవిందయ్య కొలువు లేదుట! ఇంకేం, ఇదా గోవిందయ్య గాడి పనే! భద్రయ్య మనస్సు అభద్రమై పోయింది. ఆఫీసు కెళ్లి కాగితాలు చూడటానికి మనసొప్పలేదు. లంచి ముగించుకొని, లైబ్రరీ కెళ్లాడు భద్రయ్య.

* * *

చెకుముకిరాళ్లు కలుసుకొన్నాయి లైబ్రరీలో.

పొద్దున్న పెట్టిన చక్కిలాలు ప్లస్ మధ్యాహ్నం పెట్టిన కరకరలు కలిపి నెమరు వేసుకుంటూ ఆ లైబ్రరీ లోనే పడిఉన్నాడు గోవిందయ్య.

"ఎవడో దిక్కుమాలినోడు కూచున్నాడని పని వదిలి వచ్చావా, పెద్ద మొగోడివి? నువ్వింకా ప్రెసిడెంటు అయ్యేదేమిటి, నేనా సుబ్బిదయ్యంతో పందెం గెలిచేదేమిటి?" అంటూ చిందులేసింది, ఉడ్ బి ఫస్ట్ లేడీ.

దానితో ఆ దిక్కుమాలినోడిమీద విపరీతమైన కోపం వచ్చింది గోవిందయ్యకు. ఇప్పుడు భద్రయ్యను చూచేసరికి ఆ కోపమంతా పంచాయితీ రాజకీయాలకు వాడుకోవాలనే స్పృహ వచ్చింది.

"ఊళ్లోకి ఎవరొస్తున్నారో, ఎవరు పోతున్నారోకూడా పట్టని ప్రభువులు ఊళ్లేలుతున్నారు. ఏం చేస్తాం?" వ్యంగ్యాలు విసిరాడు గోవిందయ్య.

"ఎదురొచ్చి నిలబడలేని నాయకులు దొంగదెబ్బలు తియ్యటానికి ఇట్టా ఊళ్లమీదికి దండు దింపుతుంటారు" నర్మగర్భంగా మాట్లాడాడు భద్రయ్య.

"అంతేలే, ఆడలేనమ్మ ఈవేళ మంగళవార మన్నదిట. ఆ డెవడో, ఏమిటో పంచాయితీ పెట్టలేక. . ." గోవిందయ్య కవ్వింపు.

"పెడతాం. పంచాయితీ లేకుండానే ఊరుకుంటామా? ఎవరి బండార మేటో బయటపడద్దూ? ఒరేయ్, నువ్వా పెద్ద మంత్రి కెళ్లు ప్రెసిడెంటు బాబు రమ్మన్నారని ఆ దొంగనాయాల్ని లాక్కు రారా. ఆ డెవరో, ఏమిటో, ఏ కిరాతకుడు రమ్మంటే వచ్చాడో—అన్నీ తేలిపోతాయి" అన్నాడు భద్రయ్య.

• • •

'తేలిపోతుందిలే! వీ డెవరో మఫ్టీ వెధవే అయ్యుంటాడు. ఆ చింపిరి జుట్టూ వీడూను!' అనుకున్నాడు పూజారి మల్లయ్య, గుడి అరుగు పంచాయితీ కెళుతూ.

'బవిరి గడ్డం వెధవ! ఆ డెవడో దోపిడీ గాంగ్‌గాడే అయ్యుంటాడు' అనుకున్నాడు గోవిందయ్య, పంచాయితీలో పాల్గొనటాని కెళుతూ.

'దిక్కుమాలినోడి ధర్మమా అని గోవిందయ్యకు, భద్రయ్యకు మంచి లడాయి పడిందిలే!' లడాయిపూలూ, గన్నేరుపత్రీ తీసుకొని దేవాలయాని కెళుతూ సంబరపడ్డాడు శెట్టి.

'ఎర్రగా ఆ కళ్లు చూడరాదూ? వాడు ఖచ్చితంగా రంగి అన్న రౌడీ వెధవే!' పంచాయితీ ప్రేక్షకులలో ఒకడైన అల్లుడు బాబు స్వగతం!

'ఆ పేలికలు చూడు! ఎంత బీదోడైతే మాత్రం ఇంత చినిగిన గుడ్డ లేసుకుంటాడా? ఈ డెవరో సి. ఐ. డి. వెధవే అయ్యుంటాడు' అనుకున్నాడు పంచాయితీ పెద్ద భద్రయ్య.

భౌ భౌ మన్నాయి ఊరికుక్కలు— పంచాయితీ కొస్తున్న కొత్త జీవిని చూసి.

• • •

పంచాయితీ ప్రారంభం కాబోతున్నది.

"ఏ మఫ్టీ పోలీసు బాబన్నానేమో, ముందు మర్యాదగా అడిగి చూడండి." సలహా ఇచ్చాడు, పూజారి మల్లయ్య.

"పోలీసా, గీలీసా? ఇలాటి సన్నాసులంతా పోలీసులైతే. . . ఏ గాంగువాడో ముందు కనుక్కోండి." పాయింటాఫ్ ఆర్డర్ తెచ్చాడు గోవిందయ్య.

"దోపిడీ వెధవలు ఇంత పబ్లిగ్గా వస్తారా? వీ డెవరో రౌడీ వెధవ. ఈ మధ్య ఇట్లాంటి వెధవలు మర్యాదస్థుల్ని బ్లాక్‌మెయిల్ చెయ్యటానికి బయలు దేరుతున్నారు. జాగ్రత్తగా కనుక్కోండి" ప్రేక్షకుల తరఫున సూచన లిచ్చాడు అల్లుడుగారు.

"నా కెవరి సలహాలు అక్కర్లే—ఈ డెవరో, ఏమిటో, ఎవడు పిలిస్తే వచ్చాడో అన్నీ బయటకు లాగుతా." హామీ ఇచ్చాడు భద్రయ్య.

• • •

పంచాయితీ సాగిపోతున్నది.

నిర్దోషి నోరు మెదపటం లేదు. దోషులు కంగారుపడిపోతున్నారు.

"ఇదిగో, చింపిరితలా! నువ్వెవరన్నా మఫ్టీ పోలీసువా?" పూజారి మల్లయ్య ప్రశ్న.

"ఒరేయ్, బవిరి గడ్డం, చెప్పు. నువ్వెవరి గాంగో చెప్పు." గోవిందయ్య దబాయింపు.

"ఏమి టా రౌడీచూపులు, రౌడీ వెధవా! పెద్దవాళ్లు అడుగుతుంటే మాట్లాడవేం? ఆకళ్లు చూడు, ఎర్రగా." ఉద్రేకపడిపోయాడు, ఊరి వారి అల్లుడు.

దేవుడు

మతాన్ని పడపోస్తే వచ్చే సారం — పాపుల్ని రక్షించడానికే జీసస్ అవతరించాడని. పాపుల పరిధిలోనే భగవంతుని అవతారం ప్రచారం పొందుతుంది.

—ఆర్చిబాల్ట్ అలెగ్జాండర్

* * *

'ప్రేమ' నిషాకి 'పెళ్లి' ఒక్కటే విరుగుడు.

—కిలే

"ఒరేయ్ చింపిరి గుడ్డల సన్నాసీ, నిన్నెవరన్నా సి. ఐ. డి. పని చెయ్యమని పిలిపించారా? నిజం చెప్పు." భద్రయ్య విచారణ.

* * *

"నువ్వెవరన్నా మఫ్టీ పోలీసువా?"

"నువ్వే దోపిడీగాంగువాడివిరా?"

"ఏ ఊరి రౌడీవిరా నువ్వు?"

"కాకపోతే సి. ఐ. డి. గాడివా?"

"నేనో మడిసిని!" చింపిరి తలవాడు, బవిరిగడ్డం వాడు, గుంటకళ్లవాడు, చినిగిన గుడ్డలవాడు నోరెత్తి ఒక్కసారి సమాధానం చెప్పాడు.

"హారినీ. . . మడిసివా!" ఆశ్చర్యపోయింది ఆ ఊరు ఊరంతా.

• • •

ఆ ఊరు చెట్లఊరు. చెట్లకు తోడుగా ఆ ఊరిలో అక్కడక్కడ ఇళ్లు ఉంటాయి. ఆ చెట్లు ఎంతో ఎత్తుగా ఎదిగి, మరింకెంతో గుబురుగా పెరిగి బోలెడంత నీడను ఇస్తుంటాయి. ఆ నీడకు తోడు లేకపోతే తన సృష్టికేదో లోపం వస్తుందని కాబోలు, భగవానుడా ఊరిలో మనుషుల్నికొందర్ని నిలబెట్టాడు.

హారినీ. . . అని ఆశ్చర్యపోయిన మనుష్యులు అచ్చు ఆ దేవుడు నిలబెట్టిన పిండిబొమ్మలల్లనే ఉన్నారు.

లోకాన్నంతా వెలుగుతో నింపిన కొంత సేపటికిగాని ఆ ఊరి వంక కన్నెత్తి చూడడు సూర్యభగవాన్లు. మొదటైన పది నిమిషాలకుగాని వాన చినుకులు ఆ ఊరి నేలను తడుపలేవు. మహా ప్రభంజనం వీస్తే తప్ప ఆ ఊరి పడుచుల ముంగురులు అల్లల్లాడవు. అతి సామాన్య విషయాలుకూడా ఆ ఊరికి వస్తే అలస్యంగా వస్తాయి. లేదంటే అసలు రానే రావు.

హారినీ. . . అన్న ఆశ్చర్యం వచ్చింది— ఆలస్యంగానైనా. ★